


రేపు డిప్యూటీ డీఈవో పోస్టులకు ప్రవేశ పరీక్ష

కలెక్టరేట్, మే 23: ఏపీపీఎస్సీ అధ్వర్యంలో డిప్యూటీ డీఈవో పోస్టుల భర్తీకి ప్రవేశ పరీక్ష ఈనెల 25న జరగనుంది. ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకూ ఆరు కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. ఆఫ్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 1470 మంది హాజరు కానున్నారు. అభ్యర్థులు ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్య హాజరుకావాలి. రాజాం జీఎంఆర్‌లో 300 మంది,ఎంవీజీఆర్‌లో 250మంది, అవంతి (భోగాపురం)లో 170, స్వామి వివేకానంద కాలేజీ(బొబ్బిలి)లో 90, సత్య కాలేజీ(విజయనగరం)లో 150, ఐయాన్ డిజిటల్ జోన్ (సీతంలో) 510 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.



అమ్మకానికి పెట్టిన భూముల్లో మామిడి చెట్లు

ఎకరం రూ. లక్ష!

- డి.పట్టా, గెడ్డ పోరంబోకు భూముల అమ్మకం
- ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు అడ్డుగోలుగా..
- వీలుపర్తి రెవెన్యూలో గుట్టుగా వ్యవహారం
- అడ్డుకున్న ఉపసర్పంచ్ భర్తకు బెదిరింపులు

వేపాడ, మే 23: వీలుపర్తి రెవెన్యూలోని గెడ్డ, వాగు, డి.పట్టా భూములు కారుచౌకగా అమ్మకాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఇదివరకే రైతుల నుంచి లీజు పేరుతో చేజిక్కించుకున్న కొందరు వ్యక్తులు ఇప్పుడు ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు విక్రయించేందుకు చూస్తున్నారు. ఈ విషయం తెలిసి రైతులు అడ్డుకుంటున్నారు. వీరికి అండగా నిలిచిన ఉపసర్పంచ్ భర్తకు బెదిరింపులు వస్తున్నాయి.

వీలుపర్తి గ్రామ రెవెన్యూలో సర్వే నెంబరు 4, 6లలో గల 26 ఎకరాల గెడ్డ పోరంబోకు భూమి, సర్వే నెంబరు 2, 4, 6లలో గల డి.పట్టా భూములు 33 ఎకరాలతో పాటు వేపాడ రెవెన్యూలో మరో 30 ఎకరాల వరకు డి.పట్టా భూములను గతంలో కొందరు వ్యక్తులు రైతుల నుంచి అనధికారికంగా లీజు ఒప్పందంతో తీసుకున్నారు. అనంతరం ఆ భూముల్లో చేపల చెరువులు, వివిధ రకాల పండ్ల తోటలను సాగు చేస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో వారు ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థకు ఈ భూములను గెడ్డ పోరంబోకు ఎకరా రూ.లక్ష చొప్పున, డి.పట్టా భూములు ఎకరా రూ..రెండు లక్షలకు విక్రయించేందుకు నిర్ణయించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన రైతులు, ఉప సర్పంచ్ భర్త గోకాడ అచ్చెంనాయుడు ఆధ్వర్యంలో భూముల విక్రయాన్ని అడ్డుకుంటున్నారు. ఈ విక్రయాలు జరిగితే తర్వాత భూములు రైతులకు పూర్తిగా దక్కవన్నది వారి భయం. దీనిపై ఉపసర్పంచ్ భర్త గోకాడ అచ్చెంనాయుడు ఆధ్వర్యంలో రైతులు పోలీసులను ఆశ్రయించారు. అయితే పోలీసులు రైతులకు అండగా ఉండకపోగా తిరిగి భూముల కొనుగోలుదారుకు మద్దతుగా మాట్లాడుతూ ఉప సర్పచ్‌ను బెదిరిస్తున్నారు. పోలీసులు తనను కార్యాలయానికి పిలిచి బెదిరించారని అచ్చెంనాయుడు విలేకరుల వద్ద బుధవారం వాపోయారు. తనపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తానని, తప్పుడు కేసులు బనాయించి రాజకీయ జీవితం లేకుండా చేస్తానంటూ ఓ పోలీస్ అధికారి బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశాడు.

● ప్రభుత్వ భూముల అమ్మకాలపై ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని గ్రామస్థులు గోకాడ చిన్న అప్పలనాయుడు, పి.ప్రసాదు, గోకాడ కన్నంనాయుడు, సత్యారావు, శ్రీను, ఉల్లి సన్నిబాబు, సీతమ్మ, గోకాడ నర్సిబాబు, అప్పలనాయుడు, కంబాలముత్యాలయ్య, లక్కవరపు అచ్చన్న, శంకర్, ఏడువాకరాములు, నర్సిబాబు, అప్పారావు తదితరులు హెచ్చరిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూముల అమ్మకాలపై దృష్టి సారించి నిరుపేద రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

విచారించి చర్యలు..

వీలుపర్తి రెవెన్యూలో గెడ్డ , వాగు, డి.పట్టా భూముల అమ్మకాలపై రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపడ్తాం. జిల్లా అధికారులకు నివేదిక అందించడంతో పాటు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకుంటాం.

-కె.సత్య, తహసీల్దార్, వేపాడ



వీలుపర్తి భూముల వద్ద రైతుల ఆందోళన

పకడ్బందీగా కౌంటింగ్



- ఉదయం 8 గంటలకు ప్రారంభం
- ఒక వైపు ఈవీఎం ఓట్లు .. మరోవైపు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు
- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, మే 23: ఓట్ల లెక్కింపు పకడ్బందీగా జరగాలని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆర్వోలు, ఏఆర్వోలు, డీటీలు, నోడల్ అధికారులకు ఓట్ల లెక్కింపుపై గురువారం మొదటి విడత శిక్షణ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వివిధ దశలు, పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. లెక్కింపు ప్రక్రియ మొత్తం ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని, సొంత నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. చిన్న పొరపాటుకు కూడా తావివ్వద్దని, ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండి కేటాయించిన విధులను పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియపై అందరూ సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, అందువల్ల సిబ్బంది 6 గంటలకే తమకు కేటాయించిన లెక్కింపు కేంద్రాలకు చేరుకుని అన్నీ సిద్ధం చేసుకోవాలని సూచించారు.

లెండి కళాశాలలో ఎంపీ పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు

లెక్కింపు కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఒకేసారి జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్లు అధిక సంఖ్యలో పోలైనందున, లెక్కింపు పూర్తి కావడానికి ఎక్కువ సమయం పడుతుందని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విజయనగరంలో పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మాత్రం లెండి కళాశాలలోనే నిర్వహిస్తామని, ఇందుకోసం 20 టేబుళ్లతో పెద్ద హాలును సిద్ధం చేస్తున్నామ న్నారు. ఈవీఎం ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో హాలులో 14 టేబుళ్లను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రతి గదిలో సిసి టివి ఉంటుందని, ఈవిఎంలు తీసుకు వచ్చిన దగ్గర నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకూ వీడియో రికార్డింగ్ కూడా నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డును ధరించాలని, అవి లేకపోతే లోపలికి అనుమతించేది లేదని చెప్పారు. కౌంటింగ్ హాలులో రిటర్నింగ్ అధికారుల దే సర్వాధికారమని, వారే పూర్తిగా నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో అనిత తదితరులు ఉన్నారు.

భద్రత కట్టుదిట్టం



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

ఏజెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి : ఎస్పీ దీపిక

విజయనగరం క్రైం, మే 23: కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండాలని ఎస్పీ దీపిక ఆదేశించారు. వచ్చేనెల 4న ఎన్నికల కౌంటింగ్ నిర్వహించే జేఎన్‌టీయు, లెండి ఇంజనీరింగ్ కళాశాలల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె జిల్లా పోలీస్ అధికారులతో గురువారం సమీక్షించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని, రూఫ్‌టాప్ బందోబస్తు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ రెగ్యులరైజేషన్, వాహనాల పార్కింగ్‌నకు ప్రత్యేక చర్యలు చేపట్టాల న్నారు. కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే కౌంటింగ్ ఏజెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి, రిటర్నింగ్ అధికారి జారీ చేసిన అనుమతి పత్రాలను పరిశీలించిన తరువాతే లోపలికి అనుమతించా లన్నారు. రిటర్నింగ్ అధికారులు, సూపర్‌వైజర్లు మినహా ఇతరుల మొబైల్స్ కేంద్రాలకు అనుమతించవద్దన్నారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరాలను బాంబు డిస్పోజర్ బృందాలతో తనిఖీలు చేయాలన్నారు. మహిళలను తనిఖీ చేసేందుకు మహిళా పోలీసు సిబ్బందిని నియమించాల న్నారు. ఫలితాలు వెల్లడైన తరువాత ఎటువంటి అల్లర్లు చెలరేగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పెట్రోలింగ్ నిర్వహించాలని అన్నారు. గుర్తించిన ప్రాంతాల్లో నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఏఎస్పీ అష్మాపరహీన్, ట్రైనీ ఐపీఎస్ మండా జావలి అల్ఫాన్స్, డీఎస్పీలు గోవిందరావు, శ్రీనివాసరావు, ఏఎస్ చక్రవర్తి, విశ్వనాథ్, వీరకుమార్, యూనివర్స్ పాల్గొన్నారు.



కందిపప్పు ఇవ్వడం మానేశారు

- 10 నెలలుగా పేదలకు అందని వైనం
- సరఫరాపై డీలర్ల విముఖత
- బయట మార్కెట్లో కిలో రూ.165 పైనే

రాజాం, మే 23: జిల్లాలో పేదలకు కందిపప్పు అందడం లేదు. రేషన్ ద్వారా పంపిణీ కాక ఇబ్బంది పడుతున్నారు. అసలు రేషన్ సరఫరాయే అస్తవ్యస్తంగా మారింది. కేవలం బియ్యం పంపిణీకే పౌరసరఫ రాల శాఖ పరిమితమైంది. కందిపప్పు, గోధుమపిండి జాడే లేకుండా పోయింది. దీనిపై లబ్ధిదారులు నిత్యం పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు.

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఏ నెలలో ఏ సరుకులు ఇస్తారో డీలర్లకే తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లాలో కేవలం బియ్యం, పంచదార మాత్రమే డిపోలకు చేరవేస్తున్నారు. కంది పప్పు పూర్తిగా గుడౌన్‌కు రాక పోవడంతో డీలర్లు కూడా తమకెందుకులే అని మిన్నకుండి పోయారు. కాగా తమ వద్ద ఉన్న కొద్దిపాటి సోడిపిండి స్టాకును తిరిగి ప్రభుత్వానికి అప్పగించారు. ఎందుకంటే మూడు నెలలు దాటిన తరువాత పిండికి గడువు అయిపోతుందని, దానిని వినియోగించకూడదనే ఆలోచనతో రాజాం, సంతకవిటి మండలాలకు చెంది 2000 కేజీల సోడిపిండిని తిరిగి పంపించేశారు. ఈనెల కొత్త స్టాకు వస్తుందని అధికారులు చెప్పుకొచ్చారు. కానీ ఇంతవరకు డిపోలకు చేరలేదు. జిల్లాలో 1244 రేషన్ డిపోలు ఉన్నాయి. మొత్తం 5,81,212 కార్డులు ఉన్నాయి. కార్డుకు అరకిలో పంచదారతో పాటు కిలో కందిపప్పు, కిలో సోడిపిండి అందించాల్సి ఉంది. 10 నెలలుగా కందిపప్పు అందించడం లేదు. ప్రస్తుతం కందిపప్పు కిలో ధర రూ.165పై మాటే. నాణ్యత కలిగిన కందిపప్పు ధర రూ.180 వరకూ పలుకుతోంది. సాధారణంగా ప్రతి ఇంట్లోనూ కందిపప్పు వాడతారు. కొందరు వారానికో రెండుసార్లు, ఇంకొందరు నిత్యం ఉపయోగిస్తారు. ఎంతో కొంత మోతాదులో కందిపప్పు వాడడం సర్వసాధారణంగా మారింది. ధర చూస్తే సామాన్యుడికి అందనంత దూరంలో ఉంది. అదే రేషన్ డిపోల్లో అయితే కిలో కందిపప్పు రూ.67కు అందిస్తారు. కానీ గత 10 నెలలుగా జాడలేదు.

ఇండెంట్ పెడుతున్నా..

ప్రతినెలా జిల్లా అధికారులు పౌరసరాఫరాల శాఖకు ఇండెంట్ పెడుతున్నా ఫలితం లేకపోతోంది. అటు పంచదార పరిస్థితి కూడా అంతే. సాధారణంగా ప్రతినెలా 15 తరువాత డీలర్లు ఇండెంట్లు పెడతారు. బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు కావాలని అడుగుతున్నారు. అధికారులు మాత్రం లేవని చెబుతున్నారు. పౌరసరఫరాల సంస్థ నుంచి రాకుంటే తామేమి చేస్తామని తేల్చిచెబుతున్నారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో..

టీడీపీ ప్రభుత్వ హయాంలోనే కిలో బియ్యం రూపాయికే అందివ్వడం ప్రారంభమైంది. పంచదార, కందిపప్పు, గోధుమలు, రాగులు, సజ్జలు, సెనగలు కూడా రేషన్‌లో భాగంగా అందించేవారు. దసరా, దీపావళి, రంజాన్, క్రిస్మస్, సంక్రాంతికి కానుకల పేరిట కిట్లు ఇచ్చేవారు. సామాన్య, పేద ప్రజలకు పండుగ అవసరాలు దాటిపోయేవి. కానీ ఇప్పుడు బియ్యం కూడా సక్రమంగా అందించలేని స్థితిలో వైసీపీ సర్కారు ఉంది. అటు కేంద్రం అందించే ఉచిత బియ్యం సరఫరాను నెలల తరబడి నిలిపివేసి సామాన్యులకు ఇబ్బందిపెట్టారు.

ఇండెంట్ పెట్టాం

జిల్లాలో రేషన్ పంపిణీ ప్రక్రియలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. పంచదార నిల్వలు లేకపోవడంతో పౌరసరఫరాల సంస్థ సరఫరా నిలిపివేసింది. కందిపప్పు కోసం ఇండెంట్ పెట్టాం. కానీ అనుకున్న స్థాయిలో రావడం లేదు. ఉన్నంతలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా సరఫరాకు ప్రయత్నిస్తున్నాం.

- కె.మదుసుధనరావు, జిల్లా అధికారి, విజయనగరం





కనీస వేతనం చెల్లించాలి

- కొనసాగుతున్న జిందాల్ కార్మికుల ఆందోళన



కొత్తవలస, మే 23: అప్పన్నపాలెం పంచాయతీలోని జేఎస్ఎల్ కర్మాగారం వద్ద కార్మికులు గురువారం కూడా తమ నిరసనను కొనసాగించారు. కర్మాగారాన్ని కార్మికుల వల్ల మూసేయలేదని, నష్టాలు వస్తున్నందున మూసేశామని చెబుతున్నారని, లాభాలు వచ్చినప్పుడు తమకేమైనా బోనస్‌లు ఇచ్చారా? అని ప్రశ్నించారు. కర్మాగారం తెరచే వరకు నెలకు కనీసం 20 రోజులకైనా వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కర్మాగార ఉత్పాదకత వ్యయం పెరిగి పోవడం, ముడిసరుకులు కొరత కారణంగా కర్మాగారానికి లాకౌట్ వేయాల్సి వచ్చిందని యాజమాన్యం చెబుతున్నందున, తమకు కనీసం 20 రోజులైనా పని కల్పించండి.. లేకపోతే 20 రోజుల వేతనాన్ని అయినా చెల్లించాలన్నారు. యాజమాన్యం రెగ్యులర్ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులంటూ వ్యత్యాసం చూపించడం తగదన్నారు. కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులందరినీ ఒకేలా చూడాలన్నారు. ఈ నెలాఖరువరకు తమకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గురువారం అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేముడు శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. కర్మాగారంలో ఉన్న మూడు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జేఏసీ ఏర్పాటు చేసుకున్నారు.



ప్రత్యేక ఆకర్షణగా డ్రమ్స్ కళాకారుడి ప్రదర్శన




మహిళల కీర్తనలు


వైభవంగా అన్నమయ్య జయంత్యుత్సవం

విజయనగరం రూరల్, మే 23: ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్, దశగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ సంయుక్తంగా విజయనగరంలో గురువారం నిర్వహించిన అన్నమయ్య 616 జయంత్యుత్సవం వైభవంగా సాగింది. సంగీతాభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సప్తగిరి సంకీర్తనల గోష్ఠి, నృత్య ప్రదర్శనలు, స్థానిక కళాకారుల కీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అన్నమయ్య కీర్తనల వైశిష్ట్యం గురించి మహారాజా కళాశాల విశ్రాంత అధ్యక్షుడు డాక్టరు అయ్యగారి రాఘవరావు ప్రసంగం ఇచ్చారు. దవళ సర్వేశ్వరరావు, డాక్టరు డీవీ శ్రీకాంత్, డాక్టరు మండపాక రవి తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



చిన్నారుల నృత్య ప్రదర్శన







ఘనవిజయం సాధించాలి

అల్లు అరవింద్



ఆశిష్, 'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య నటించిన చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. దిల్ రాజు, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ "ఈ మూవీ కోసం చిత్రబృందం చాలా కష్టపడ్డారు. ఈ సినిమా ఘనవిజయం సాధించాలి. 'లవ్ మీ' టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్" అని అన్నారు. "'లవ్ మీ' డిఫరెంట్ సినిమా. ఈ చాలెంజింగ్ స్క్రిప్ట్‌ను అరుణ్ తెరకెక్కించిన విధానం సూపర్బ్. కొత్తదనాన్ని కోరుకునే ప్రేక్షకులకి ఈ సినిమా తప్పక నచ్చుతుంది" అని నిర్మాత దిల్‌రాజు చెప్పారు. సంగీత దర్శకుడు కీరవాణి మాట్లాడుతూ "ఈ సినిమాతో దర్శకుడు అరుణ్ నాన్ లీనియర్ నేరేషన్‌కు కొత్త నిర్వచనం ఇచ్చారు" అని అన్నారు. చిత్ర దర్శకుడు అరుణ్ భీమవరపు మాట్లాడుతూ "ఈ సినిమాకు సీక్వెల్‌గా 'కిల్ మీ ఇఫ్ యు డేర్' వస్తుంది" అని చెప్పారు. హీరో ఆశిష్ మాట్లాడుతూ "ఈ సినిమా సక్సెస్‌పై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. సంగీత దర్శకుడు కీరవాణి, సినిమాటోగ్రాఫర్ పీసీ శ్రీరామ్ వంటి దిగ్గజాలు ఈ సినిమాకు వర్క్ చేయటంతో లక్కీగా ఫీలవుతున్నాం" అని చెప్పారు.

రాజు యాదవ్ ఓ ఎమోషనల్ రైడ్



టెలివిజన్ కామెడీ షో 'జబర్దస్త్'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు గెటప్ శ్రీను. తర్వాత పలు చిత్రాల్లో నటించిన ఆయన.. మంచి కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల మనసులు గెలుచుకుని పాపులర్ కమెడియన్‌గా మారారు. ఆయన తొలిసారి హీరోగా నటించిన చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. కె.ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి సంయుక్తంగా నిర్మించారు. ఫన్, ఎమోషనల్ రైడ్‌గా తెరకెక్కిన 'రాజు యాదవ్' ఈ రోజే విడుదలవుతున్న సందర్భంగా హీరో గెటప్ శ్రీను మీడియాతో ముచ్చటించారు.

"దర్శకుడు నన్ను కలిసినప్పుడు మొదట నా పాత్ర గురించి చెప్పారు. భలే అనిపించింది. ఆ తర్వాత కథ వినగానే వెంటనే ఒప్పేసుకున్నా. ఈ కథను డైరెక్టర్ వాస్తవ సంఘటనల ఆధారంగా రాసుకున్నా.. క్యారెక్టర్ మాత్రం కల్పితమే. నేను ఇప్పటి వరకు చేసిన పాత్రల్లో అత్యంత సవాల్‌తో కూడుకున్నది ఇదే. ఎప్పుడూ నవ్వుతూ ఉండటం మామూలు విషయం కాదు. కొన్ని సందర్భాల్లో ఈ పాత్రలో వంద శాతం ఇవ్వలేనేమోనని.. ఒక ఆర్టిస్ట్‌గా ఫెయిల్ అయిపోతానేమో అని అనుకున్న సందర్భాలూ ఉన్నాయి. అటువంటి సమయాల్లో దర్శకుడే నన్ను సపోర్ట్ చేశారు. ఈ సినిమాను దర్శకుడు కృష్ణమాచారి చాలా సహజంగా తెరకెక్కించారు. ప్రస్తుత తరం ప్రేక్షకులు రియలిస్టిక్ సినిమాలనే ఇష్టపడుతున్నారు. ఈ సినిమా కూడా సహజత్వం కోరుకునే ప్రేక్షకులందరికీ తప్పక నచ్చుతుంది" అని చెప్పారు.

'మంజుమ్మెల్ బాయ్స్' నిర్మాతలకు ఇళయరాజా లీగల్ నోటీసులు



మలయాళ బ్లాక్‌బస్టర్ చిత్రం 'మంజుమ్మెల్ బాయ్స్' నిర్మాతలకు ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా లీగల్ నోటీసులు పంపారు. కారణం 'గుణ' చిత్రం కోసం ఇళయరాజా స్వరపరిచిన 'కమ్మని ఈ ప్రేమ లేఖలే' పాటను ఈ సినిమాలో వాడడమే. అనుమతి తీసుకోకుండా, రాయల్టీ ఫీజు చెల్లించకుండా ఇలా పాటను ఉపయోగించడం కాపీరైట్ చట్టాన్ని అతిక్రమించినట్లేనని ఇళయరాజా లాయర్ శరవణన్ అన్నాదురై నిర్మాతలకు పంపించిన నోటీసులో హెచ్చరించారు. ఈ విషయంపై 15 రోజుల్లో నిర్మాతలు తగిన విధంగా స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని ఆయన తెలిపారు. కాగా, రజనీకాంత్ ప్రస్తుతం లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో నటిస్తున్న 'కూలీ' సినిమాలోనూ తను సంగీతం అందించిన 'తంగా మగన్'(1983) చిత్రంలోని 'వా వా పక్కమ్ వా' పాటను కూడా అనుమతి లేకుండా వాడారని ఇళయరాజా, నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్‌కు ఈ నెల 2న నోటీసులు పంపిన సంగతి తెలిసిందే.

దర్శకుడిగా మరో కొరియోగ్రాఫర్



పలు చిత్రాలకు కొరియోగ్రఫీ నిర్వహించిన సతీశ్‌రాజ్ దర్శకుడవుతున్నారు. స్వీయ దర్శకత్వంలో ఎస్.ఆర్. మూవీ జంక్షన్ బేనరుపై ఓ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సంస్థ లోగోను సీనియర్ నటుడు మురళీమోహన్ ఆవిష్కరించారు. తన ఇష్టదైవం సాయిబాబా కావడంతో 'శ్రద్ధ.. సబూరి' పేరుతో రూపొందించిన పాటను కొరియోగ్రాఫర్లు శేఖర్ మాస్టర్, విజయ్ బిన్నీ, నిర్మాత దామోదర ప్రసాద్ రిలీజ్ చేశారు. మూడు నిముషాల పాటలో మొత్తం కథ అర్థమయ్యేలా చూపించే దర్శకుడే కొరియోగ్రాఫర్ అనీ, ప్రతిభావంతుడైన సతీశ్‌రాజ్ దర్శకుడిగా మారడం ఆనందదాయకం అనీ మురళీమోహన్ చెప్పారు. సభలో పాల్గొన్న అతిథులందరూ దర్శకుడిగా కూడా సతీశ్‌రాజ్ విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ శిరీష, నిర్మాత అర్చన కూడా పాల్గొన్నారు.

కొత్త తేదీన సత్యభామ



కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'సత్యభామ'. ఇందులో ఆమె శక్తిమంతమైన పోలీసాఫీసర్ పాత్ర పోషించారు. ఈ చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. జూన్ 7న 'సత్యభామ'ను విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం గురువారం ప్రకటించింది. నవీన్ చంద్ర కీలకపాత్ర పోషించిన ఈ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించారు. దర్శకుడు శశికిరణ్ తిక్క స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల. సినిమాటోగ్రఫీ: బి విష్ణు





మడ్డువలస ప్రాజెక్టుపై నిర్లక్ష్యం

● మొక్కుబడిగా మరమ్మతులు ● అస్తవ్యస్తంగా కాలువలు ● ఆయకట్టుకు అందని నీరు


మడ్డువలస రిజర్వాయర్ గేట్ల వద్ద నిత్యం లీకులు

వంగర, మే 23: విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 35 వేల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టును ప్రభుత్వం ఐదేళ్లుగా నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. ఆ మధ్య మరమ్మతులు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికీ గేట్ల నుంచి లీకుల ద్వారా అధికంగా నీరు వృథాగా పోతోంది. జలాశయం కాలువలు కూడా అధ్వానంగా ఉన్నాయి. వెరసి ఆయకట్టు అంతటికీ నీరు అందే పరిస్థితి లేదు.

మడ్డువలస జలాశయం పరిధిలో 50.05 కిలోమీటర్ల విస్తీర్ణంలో కుడి కాలువ ద్వారా శ్రీకాకుళం జిల్లా లావేరు, రణస్థలం, పొందూరు, జి.సిగడాం మండలాలతో పాటు రేగిడి, సంతకవిటి మండలాలకు సాగునీరు అందాల్సి ఉంది. కాలువలు పూడుకుపోవటం, గండ్లు పడడంతో చాలా ఆయకట్టుకు నీరు అందడం లేదు. ఈ సమస్యను పరిష్కరించడం లేదు. కాలువలను అలాగే వదిలేశారు. శివారు భూములకు నీరు అందక ఏటా రైతులు నష్టపోతున్నారు. ఇదిలా ఉండగా రిజర్వాయర్ ప్రధాన గేట్లకు మరమ్మతులు, విద్యుత్, లైటింగ్, తలుపులకు రబ్బరు సీల్లు, రంగులు తదితర వాటి కోసం కొద్ది నెలల కిందట రూ.1.80 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో నామమాత్రంగా కొన్ని పనులే చేశారు. 1, 2, 3 గేట్లుకు రబ్బరు సీల్లు వేశారు. మరమ్మతులకు గురైన ఉన్న 5,6,10, 11 నెంబరు గల గేట్లుకు రబ్బరు సీళ్ల వేయకపోవడంతో నిత్యం నీరు వృథాగా పోతోంది. అలాగే జలాశయ ప్రాంగణంలో విద్యుత్ బల్బులు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. సుమారు 50 శాతం కూడా పనులు పూర్తికాలేదు. ఖరీఫ్ సీజన్ పేరుతో మధ్యలో పనులు నిలిపేశారు.


మరమ్మతులకు నోచుకోని కాలువ

ఫేజ్ 2 లో జరగాల్సిన పనులిలా..

ఐదేళ్ల క్రితం ఎన్నికల ప్రచారంలో అధికార పార్టీ నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం ఫేజ్ 2లో భాగంగా కాలువ పనులు, తలుపులకు మరమ్మతులు, గండ్లు పూడ్చివేత పనులతో పాటు పొందూరు, లావేరు మండలాల్లో అదనంగా కాలువలను తవ్వాల్సి ఉంది. ఏమీ జరగలేదు. వంగర, సంతకవిటి, రేగిడి, జి.సిగడాం మండలాల్లో 24877 ఎకరాలకు సాగునీరు అందుతున్నట్లు రికార్డులు చెబుతుండగా, రెండో దశలో కొత్తగా ఎచ్చెర్ల మండలంలో 1317, జి.సిగడాంలో 536, పొందూరులో 5173, లావేరులో 5474 ఎకరాలు కలిపి మొత్తం 12500 ఎకరాలకు అదనంగా నీరు అందిస్తామని గత ఎన్నికల ప్రచారంలో నాయకులు హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చినా విస్మరించారు. పొందూరు, లావేరు మండలాల్లో రైతులు ఇచ్చిన భూములకు పరిహారం చెల్లించకపోవడంతో పనులు కనీసం జరగలేదు.

త్వరలో ప్రారంభిస్తాం..

రిజర్వాయర్‌కు మరమ్మతులు ప్రారంభించిన కొద్దిరోజులకే ఖరీఫ్ సీజన్ రావడంతో పనులు ఆపేశాం. రబీ సైతం ముగియడంతో త్వరలో పనులు ప్రారంభిస్తాం. కాలువ పూడికలు తీయడానికి కొంతమొత్తం మంజూరైంది. కాంట్రాక్టర్లు రాకపోవడంతో పనులు జరగలేదు. కాంట్రాక్టర్లు ముందుకొస్తే పనులు పూర్తి చేసి రైతులకు పూర్తిస్థాయిలో నీరు అందిస్తాం.

-పి.అర్జున్, డీఈఈ, మడ్డువలస

వివాహిత ఆత్మహత్యాయత్నం

మక్కువ: ఒంటిపై కిరోసిన్ పోసుకుని వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల కేంద్రం మక్కువలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక హరిజనవీధికి చెందిన తుట్ల మాధురికి కృష్ణతో వివాహమై 15 సంవత్సరాలైంది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. గత కొద్ది రోజులుగా భర్త మద్యం తాగుతూ ఇంటికి వచ్చి గొడవ పడేవాడు. బుధవారం రాత్రి ఇరువురి మధ్య వివాదం చోటుచేసుకోగా క్షణికావేశానికి లోనైన మాధురి ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పు పెట్టుకుంది. గమనించిన బంధువులు మక్కువ పీహెచ్‌సీలో చేర్పించగా ప్రథమ చికిత్స అనంతరం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.

అనంతయ్య మృతదేహంపై టీడీపీ జెండా

● చివరి కోరిక నెరవేర్చిన కుటుంబ సభ్యులు



అనంతయ్య మృతదేహంపై టీడీపీ జెండా ఉంచిన దృశ్యం

శృంగవరపుకోట రూరల్: టీడీపీ సీనియర్ నేత యనమదల అనంతయ్య చివరి కోరికను ఆయన కుటుంబ సభ్యులు నేరవేర్చారు. తాను చనిపోతే తన శరీరంపై పార్టీ జెండాను ఉంచాలని ఎప్పుడూ అనేవారు. ఆయన అన్నట్లుగా భార్య కమల కుమారి, కుటుంబ సభ్యులు అనంతయ్య మృతదేహంపై పార్టీ జెండాను కప్పడంతో పాటు మెడలో టీడీపీ కండువాను ఉంచారు. మాజీ ఎమ్మెల్యేలు కోళ్ల లలిత కుమారి, శోభా హైమావతి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతి రాణి, కృష్ణమహంతిపురం పీఏసీఎస్ అధ్యక్షుడు ఇందుకూరి రామరాజు, టీడీపీ, వైసీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అనంతయ్య భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. ఆయన అంతిమ యాత్రలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలోనే విద్యుత్ స్తంభం


రోడ్డు మధ్యలో పాత విద్యుత్ స్తంభం స్థానంలో ఏర్పాటు చేస్తున్న కొత్త స్తంభం

శృంగవరపుకోట, మే 23: శృంగవరపుకోట శ్రీనివాసకాలనీ (ఎంపీడీవో కార్యాలయం వెనక భాగం) రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో వీటిని మార్చాలని స్థానికులు పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులను కోరారు. అయితే ఈ స్తంభాలు పాడవడంతో గురువారం వీటి స్థానంలో కొత్త స్తంభాలను పాతారు. రోడ్డుకు ఓ పక్కన ఏర్పాటు చేయాలని స్థానికులు అడిగినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోలేదు. రోడ్డుకు మధ్యలో స్తంభాలు ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామన్నాని చెప్పినా పట్టించుకోకుండా తొలగించిన స్తంభాల స్థానంలోనే తిరిగి కొత్తగా ఏర్పాటు చేయడం ఇబ్బంది కలిగిస్తోందని టీడీపీ నాయకుడు పి.రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు మధ్యనున్న స్తంభాలను తొలగించి స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కాలనీలో లోవోల్టేజీ సమస్యను అధిగమించేందుకు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామని ఏపీఈపీడీసీఎల్ సహాయ ఇంజినీర్ ఆర్.రవికుమార్ తెలిపారు. స్తంభాలు పాడవడంతో మార్చుతున్నామన్నారు. పాత స్తంభాలను తొలగించి వాటికి బదులు రోడ్డు పక్కన ఎక్కడ స్తంభాలు వేస్తున్నా స్థానిక ఇంటి యజమానుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయన్నారు. అందుకే తొలగించిన స్తంభం స్థానంలోనే కొత్త స్తంభాలను వేయాల్సి వస్తోందన్నారు.

కోదండ రామాలయంలో భజనోత్సవం

విజయనగరం రూరల్, మే 23: కొత్తపేట కోదండ రామాలయంలో వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం భజనోత్సవం నిర్వహించారు. స్వామి వారికి మామిడి పండ్లు, పులిహోర, సెనగలను ప్రసాదంగా నివేదించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మణులు, ఆంజనేయ స్వామి, వినాయకుడు, శ్రీకృష్ణునికి కూడా వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. భజన చెట్టుకి ప్రత్యేక పూజలు, దీపారాధన చేశారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు

కొత్తపేటలో ఉన్న బంగారమ్మ, ముత్యాలమ్మ, మరిడమ్మ (ముగ్గురమ్మ)లకు వైశాఖ పౌర్ణమి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేశారు. పసుపు, కుంకుమలతో పాటు, మామిడి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

బిల్లులు ఇప్పించండి

జామి: మండల కేంద్రమైన జామిలో 2019లో ఐదు మెటల్‌రోడ్లకు గాను రూ.90లక్షలు పనిచేశామని, అయితే ఇంకా తనకు బిల్లులు రావాల్సి ఉందని వాటిని వెంటనే ఇప్పించాలని జామి మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ తాను అధికవడ్డీలకు డబ్బులు తెచ్చి పనులు చేయిస్తే చాలాకాలం బిల్లులు కాలేదని, తెచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక అప్పులు పాలయ్యాయని, తనకు ప్రస్తుతం ఆర్థిక, ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చాయన్నారు. అంతేకాక బిల్లుల సమయంలో తన వద్దనుంచి కొందరు కమిషన్ పేరుమీద డబ్బులు వసూళ్లు చేశారని, అవి కుడా తనకు వెంటనే అధికారులు ఇప్పించాలని, ఈ విషయంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, డీపీవో, జామి ఈవోకు ఫిర్యాదు చేశామన్నారు. అదేవిధంగా రెండు పైప్‌లైన్ వర్కులకు సంబంధించి రూ.8లక్షల వరకు బిల్లులు నిలుపుదల చేసి ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు.

విద్యార్థులకు శిక్షణ తరగతులు


పిల్లలకు క్యారమ్ బోర్డులో మెలకువలు నేర్పిస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట, మే 23: జిల్లా కేంద్రంలోని 29వ డివిజన్‌లో గురువారం జన విజ్ఞాన వేదిక సమతా విభాగం ఆధ్వర్యంలో పిల్లలకు వేసవిలో వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులు నిర్వహించారు. సమతా విభాగం రాష్ట్ర కన్వీనరు జి.నిర్మల మాట్లాడుతూ మెదడుకి మేత, దేశభక్తి గీతాలు, అభినయ గీతాలు, క్యారమ్‌బోర్డు వంటి వాటిలో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. జన విజ్ఞాన వేదిక వేసవి వినోదం కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

నేత్రవైద్య పరీక్షలు

రేగిడి: ఉప్పరనాయుడువలసలో గురువారం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్, స్థానిక సత్యసాయి సేవా కమిటీ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. రేగిడి, సంతకవిటి మండలాలకు చెందిన 94 మందికి వైద్యులు వివేక్‌వర్మ పరీక్షలు నిర్వహించారు. వీరిలో 46 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు.

నిషేధిత విత్తనాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి వెంకటయ్య

రామభద్రపురం, మే 23: గ్రామాల్లో నిషేధిత పత్తి విత్తనాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని మండల వ్యవసాయాధికారి వి.వెంకటయ్య తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో గురువారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి గడ్డిపిక్కల పత్తి విత్తనాల వల్ల జరిగే నష్టాలను వివరించాలని అన్నారు. ఈ సమావేశంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ కొండలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పిన్నెల్లిని పోటీకి అనర్హుడిగా ప్రకటించాలి

విజయనగరం దాసన్నపేట, మే 23: మాచర్ల నియోజకవర్గంలో రెంటచింతల మండలం పాల్వాయి గేటు గ్రామంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని చట్ట సభలకు పోటీకి అనర్హుడిగా ప్రకటించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. కేంద్ర ఎన్నికల సంఘానికి గురువారం లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగు రోజున పది రోజుల క్రితం జరిగిన ఘటనపై నేటికీ చర్యలు తీసుకోకపోతే, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘానికి ఏమి గౌరవం ఉంటుందన్నారు. దేశ వ్యవస్థలో ఎన్నికలు అత్యంత కీలకమని, పోలింగు కేంద్రాల పరిధిలో దుశ్చర్యలు చాలా ప్రమాదకరమని అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అరాచకాలను అడ్డుకోవడంలో విఫలమైందన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోవాలని కోరారు.

బంగారమ్మను దర్శించుకున్న కోళ్ల


భవానీనగర్ బంగారమ్మతల్లి పూజల్లో పాల్గొన్న లలితకుమారి

శృంగవరపుకోట రూరల్, మే 23: మండలంలో భవానీనగర్‌లో నిర్వహించిన బంగారమ్మతల్లి పండుగలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి పాల్గొని పూజలు చేశారు. గురువారం ఆలయ ధర్మకర్త ఆదారి సూరప్పరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లలితకుమారి మాట్లాడుతూ వచ్చేది కూటమి ప్రభుత్వం అని, ఐదుకోట్ల ఆంధ్రులకు బంగారు భవిష్యత్ రాబోతుందన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, నాయకులు ఇందుకూరి శ్రీనివాసరాజు, అల్లూరి సత్తిబాబురాజు తదితరులున్నారు.

సమయపాలన పాటించాలి


మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో

రాజాం: ఉపాధి హామీ పథకం వేతనదారులు విధిగా సమయపాలన పాటించాలని... అప్పుడు ప్రతి ఒక్కరికీ కూలి గిట్టుబాటు అవుతుందని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. గురువారం కంచరాం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను, మస్తర్లను పరిశీలించారు. మస్తర్లు వేయడంలో ఎటువంటి తేడాలు వచ్చినా ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కూలీలు సమయానికి పనులకు వస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కాలయాపన చేసి వెళ్లిపోకుండా పనులు ఇచ్చిన మేరకు పూర్తి చేయాలన్నారు. అప్పుడే రోజుకు రూ.300 చొప్పున కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. ఈ విషయంలో కూలీలు నిబంధనలు పాటించాలన్నారు.

పైడిమాంబ ఆలయాల్లో చండీహోమం


చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

విజయనగరం రూరల్, మే 23: వైశాఖ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని పైడిమాంబ ఆలయాల్లో ప్రత్యేకంగా చండీహోమాలను నిర్వహించారు. గురువారం ఉదయం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న వనంగుడి వద్ద, మూడులాంతర్ల వద్దనున్న చదురుగుడి వద్ద రెండు ప్రాంతాల్లో చండీహోమాలను నిర్వహించారు. చదురుగుడి వద్ద ఆలయ ఈవో ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడుకొండలు, పూజారి బంటుపల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జామిలో ఇంటర్ తరగతులు


మాట్లాడుతున్న ఎంఈవో జయశ్రీ, గంగరాజు

జామి: ఈ విద్యా సంవత్సరం నుంచి జామి ఉన్నత పాఠశాలలో నూతనంగా జూనియర్ ఇంటర్ తరగతులు ప్రారంభిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారులు జయశ్రీ, గంగరాజు, పాఠశాల హెచ్ఎం రహిమాన్ గురువారం విలేకరులకు తెలిపారు. ఈ ప్రాంత వాసుల ఎన్నో ఏళ్ల కల ప్రభుత్వ జూనియర్ కళాశాల అని.. ఈ ఏడాది నుంచి సాకారం అవుతుందన్నారు. ఇందులో భాగంగా ఎంపీసీ, సీఈసీ గ్రూపులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్కో గ్రూపులో 40 మంది విద్యార్థులను చేర్చుకోనున్నట్లు తెలిపారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా పుష్పయాగం


ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

జామి: కుమరాం కల్యాణ్‌నగర్‌లో ఉన్న శ్రీఐశ్వర్యలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గురువారం పుష్పయాగం నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా దీనిని ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఖాతాదారుల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ రాఘవేంద్రరావు

రాజాం రూరల్, మే 23: ఖాతాదారుల సంక్షేమం, వారి అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్నామని ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు స్పష్టం చేశారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు రుణ సౌకర్యం కల్పించి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇక్కడి ఓ ప్రయివేటు కల్యాణ మండపంలో గురువారం బ్యాంకు సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఖాతాదారులు, షేర్‌హోల్డర్లను ఉద్దేశించి మాట్లాడుతూ బ్యాంకు ప్రగతిని వివరించారు. 50 శాఖల ద్వారా రూ.7,531 కోట్ల లావాదేవీలు నిర్వహిస్తున్నామన్నారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.87.70 కోట్లు లాభం ఆర్జించినట్లు పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాదారులతో పాటు వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం వివిధ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. మెడిక్లెయిమ్‌తో పాటు ప్రమాదవశాత్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులను ఆర్థికంగా ఆదుకుంటున్నామన్నారు. చిరు వ్యాపారులకు రుణ సౌకర్యం కల్పిస్తూ వారి వ్యాపారాభివృద్ధికి సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజాం శాఖ మేనేజర్ జి.ఎల్.వి. ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బ్యాంకు డైరెక్టర్లు ఖండాపు ప్రసాదరావు, ఆచాళ్ల రామకృష్ణారావు, జోనల్ మేనేజర్ ఎం.ఎం. సత్యనారాయణ, పలాస శాఖ మేనేజర్ సింహాద్రి, రేవంత్ తదితరులు పాల్గొన్నారు. సీనియర్ ఖాతాదారులు ఉల్లాకుల నీలకంఠ యాదవ్, జామి ఉషారాణిలను చైర్మన్ సత్కరించారు. బ్యాంకు సమన్వయ కమిటీ సభ్యులుగా రంప జగదీశ్వర శర్మ, లక్ష్మిని సభ్యులు ఎన్నుకున్నారు.

అందరికీ ఉపాధి హామీ


రైతులతో మాట్లాడుతున్న శివప్రసాద్

జామి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని పథకం స్టేట్ జాయింట్ కమిషనర్ శివప్రసాద్ సూచించారు. గురువారం భీమసింగి గ్రామంలో పర్యటించి ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన మామిడి మొక్కలు, ట్రెంచ్‌లు, ఫారంపాండ్‌లు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. వీటి ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పంచాయతీల్లో ఇదేవిధంగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ పథక సంచాలకులు శారదాదేవి, డ్వామా టెక్నికల్ అసిస్టెంట్ యుగేష్, ఏపీఏ కిరణ్మయి పాల్గొన్నారు.

ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయండి


ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న శతపతి అన్నపూర్ణ

బాడంగి: ఉపాధి కూలీలకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా చెప్పుకునే అవకాశం లేనపుడు ఫిర్యాదుల కోసం ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేయాలని ఉపాధి హామీ లీగల్ అంబుడ్స్‌పర్సన్ శతపతి అన్నపూర్ణ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి ఏపీవో, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో పనులు జరిగేచోట ఉపాధి కూలీలకు సమస్యలు ఉంటే ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉండన్నారు. ఉపాధి పనుల వద్ద ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేయాలని, సంబంధిత రికార్డు టెక్నికల్ అసిస్టెంట్ వద్ద ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణాకర్షత్రిపురాంతక స్వామికి లక్ష మల్లెలతో పూజ

జామి: మండల కేంద్రమైన జామిలో వేంచేసిన శ్రీస్వర్ణాకర్షత్రిపురాంతకస్వామికి వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం లక్ష మల్లెల పూజ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వనాథశర్మ మాట్లాడుతూ ఏటా ఈ పర్వదినాన విష్ణు సహస్ర నామంతో పాటు లక్ష మల్లెల పూజ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బీసీజీ టీకాలు వేయించుకోండి

కొత్తవలస: క్షయవాధి నిర్మూలన కోసం 18 సంవత్సరాలు పైబడిన వయోజనులందరూ బీసీజీ టీకాలను వేయించుకోవాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సింహాద్రినాయుడు తెలిపారు. గురువారం పీహెచ్‌సీ పరిధిలో గల వియ్యంపేట, ముసీరామ్, దేవాడ, రామలింగపురం, వీరభద్రపురం, తుమ్మికాపల్లి, నిమ్మలపాలెం, ఉత్తరాపల్లి గ్రామాలలో బీసీజీ టీకాలను వేశారు. క్షయ వ్యాధి నివారణ కోసం బీసీజీ టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ప్రతి బుధవారం ఈ టీకాలు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జగదాంబ, పద్మావతి, ఈశ్వరరావు, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కొలతలు పాటిస్తేనే వేతనం గిట్టుబాటు

రేగిడి: ఉపాధి వేతనదారులు రెండుపూటలా కొలతల ప్రామాణికత పాటిస్తేనే వేతనం రూ.300 గిట్టుబాటు ఉంటుందని ఏపీవో హరనాథ్ సూచించారు. వన్నలి గ్రామంలో యందువాని చెరువు పనిని గురువారం ఆయన తనిఖీ చేశారు. మస్టర్‌రోల్‌ను పరిశీలించారు. రైతులకు పండ్ల తోటలకు ట్రెంచ్‌లు, కందకాలకు అవకాశం ఉందని, .సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో ఒకే సిలబస్ అమలు చేయాలి

సాలూరు రూరల్ (బొబ్బిలి), మే 23: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో ఒకే సిలబస్‌ను వచ్చే విద్యా సంవత్సరం నుంచి బోధించేలా ఆదేశాలు జారీ చేయాలని ఏపీటీఎఫ్ 257 రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు డిమాండ్ చేశారు. బొబ్బిలిలో గురువారం ఏపీటీఎఫ్ డివిజన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒకే పాఠశాలలో వేర్వేరు సిలబస్ ఉండడం, విద్యార్థులు వేర్వేరుగా సిద్ధమై పరీక్షలు రాయాల్సి రావడంతో గందరగోళానికి గురవుతున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. జీవో నెంబర్ 117 రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒకే చోట బోధన ఉండాలని కోరారు. విద్యార్థులకు నచ్చిన మీడియంలో చదివే స్వేచ్ఛ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు, సింగారపు ఎల్లయ్య, పద్మ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'ఈసీ ఆదేశాలను పాటించని పెట్రోల్ బంకులు'

సాలూరు రూరల్ (బొబ్బిలి): జిల్లాలో పెట్రోల్ బంకులు ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించడం లేదని లోక్‌సత్తా పార్టీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు ఆరోపించారు. ఆయన గురువారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ సీసాలు, క్యాన్‌లలో బంకుల్లో విక్రయించరాదని ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. ఈ ఆదేశాలను బంకులు పాటించడం లేదని ఆరోపించారు. బంకుల్లో ఉచితంగా టైర్లకు గాలి అందించాలని, మరుగుదొడ్లు ఉండాలన్నారు. ఆయనతో సమాచార హక్కు చట్టం ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి సురేష్ ఉన్నారు.

ఇంటర్ ప్రవేశాలపై ప్రచారం

రేగిడి, మే 23: ఏవీపురం హైస్కూల్‌లో ఈ ఏడాది నుంచి జూనియర్ కళాశాలను ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఉపాధ్యాయులు, ఎంఈఓ ఎరకయ్య గురువారం ఇంటింటి చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఏవీపురం, అరసాడ, కందిశ, కోడిశ పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఎరకయ్య తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు

సాలూరు రూరల్ (బొబ్బిలి): ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే క్రిమినల్ కేసులు తప్పవని బొబ్బిలి సెబీ ఎస్ఐ తిరుమలరావు అన్నారు. అలజంగిలో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఇసుక రవాణాకు ఎవరికీ అనుమతులు లేవన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సీడ్ బాల్స్ చేసి విత్తుకోవాలి


నవ ధాన్యాల విత్తనాలను రైతులకు అందజేస్తున్న దృశ్యం

వేపాడ, మే 23: రైతులు ఖరీఫ్ సాగుకు వరి విత్తనాలను బాల్స్ చేసి విత్తుకోవాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ రీజనల్ ఆర్డీవో హేమసుందర్ సూచించారు. వీలుపర్తి క్లస్టర్ పరిధిలోని చినగుడిపాల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను గురువారం ఆర్డీవో హేమసుందర్, ప్రకాష్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులంతా వరి విత్తనాలను సీడ్ బాల్స్‌గా తయారు చేసుకొని విత్తుకోవాలన్నారు. దీని వల్ల వర్షం ఎప్పుడు పడితే అప్పుడు సీడ్ బాల్స్‌లో ఉన్న మొలక రావడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ఖరీఫ్ వరి సాగుకు ముందు నవ ధాన్యాల సాగు చేపట్టాలన్నారు. సిబ్బంది దీనిపై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఎఫ్ సిబ్బంది ఎస్ఎఫ్ఏ వరప్రసాద్, ఎంపీఎల్ వసంత తదితరులు పాల్గొన్నారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

కావలెను

★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్ర॥ 8374272245.
AJV_192818

ఆంధ్రజ్యోతి

అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.

ఫోన్ నెంబర్లు : ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు:
9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266

రోగులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● పార్వతీపురం మన్యం డీఎంహెచ్‌వో విజయపార్వతి


వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో

గుమ్మలక్ష్మీపురం: రోగులపై వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఎంహెచ్‌వో కె.విజయ పార్వతి సూచించారు. మండలంలోని తాడికొండ పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా గురువారం సందర్శించారు. ప్రోగ్రాం ఆఫీసర్లు వినోద్, శ్రీధర్, డీఈఎంవో హర్ష ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఏఎన్‌ఎం, ఎంఎల్‌పీహెచ్‌పీఎస్, ఆశ కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి, జ్వరాలు ఉంటే అక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారి ఎం.బుద్దేశ్వరరావు, వైద్యుడు అభిలాష్, సీహెచ్‌వో పద్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు రెసిడెన్షియల్ కళాశాలలు ప్రారంభించాలి


మాట్లాడుతున్న లోవరాజు, రామకృష్ణ

గుమ్మలక్ష్మీపురం: ఆదివాసీ ప్రాంతాల్లో అదనపు రెసిడెన్షియల్ కళాశాలలు ప్రారంభించాలని ట్రైబుల్ రైట్స్ ఫోరం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు రొబ్బా లోవరాజు, ఇంటికుప్పల రామకృష్ణ కోరారు. వారు గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పదో తరగతి పాసైన ప్రతి ఆదివాసీ బిడ్డకు కూడా కళాశాలల్లో సీటు కేటాయించేటట్టు రాష్ట్రంలోని గిరిజన విభాగంలో ఉన్న ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించాలన్నారు. గతంలో ఎప్పుడో 30 సంవత్సరాల కిందట జనాభా ప్రాతిపదికన ఆదివాసీ ప్రాంతాల్లో ఆదివాసీలు ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో కొన్ని కళాశాలలు స్థాపించారని చెప్పారు. ప్రస్తుతం ఉన్నత చదువుల వైపు ఆదివాసీలు దృష్టి పెడుతున్న క్రమంలో ప్రతి ఆదివాసీ బిడ్డకూ, పదో తరగతి పాసైన ప్రతిఒక్కరికీ సీట్లు కేటాయించినట్టు చూడాలని కోరారు. అదనపు కళాశాలలను కూడా వెంటనే ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు.

ఉపాధి టీఏపై విచారణ


సమాచారం సేకరిస్తున్న విచారణ అధికారి రామారావు

గరుగుబిల్లి: ఉపాధి పనులు నిర్వహించి బిల్లులు రాక ఆందోళనలో ఉన్న వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేసిన ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ చింతాడ రుద్రకోటేశ్వరరావు పనితీరుపై జిల్లా డ్వామా కార్యాలయ ఏవో వి.రామారావు గురువారం విచారణ నిర్వహించారు. తొలుత ఈనెల 21న విచారణ చేపట్టగా, పూర్తి సమాచారం సేకరించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈమేరకు స్థానిక ఉపాధి కార్యాలయంలో ఎంపీడీవో, ఉపాధి హామీ ఏపీవో, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి ఏవో రామారావు సమాచారం సేకరించారు. ఈ సమాచారాన్ని జిల్లా పీడీకి నివేదిస్తామని చెప్పారు. ఈ విచారణలో జిల్లా డ్వామా సీనియర్ సహాయకుడు ఎంవీ రమణ, ఏపీవో ఎం.గౌరీనాథ్, కంప్యూటర్ ఆపరేటర్ టి.తిరుపతిరావు ఉన్నారు.

భవిత కేంద్రాలపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ

మక్కువ: భవిత కేంద్రాలపై దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని మండల విద్యాశాఖాధికారి పెంట సత్యనారాయణ సూచించారు. గురువారం స్థానిక సచివాలయంలో భవిత సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రాలు దివ్యాంగులకు ఉచిత విద్యను అందించడమే కాకుండా ఆటల్లో, వివిధ పోటీలకు ప్రత్యేక శిక్షణ ఇస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ సాధారణ పిల్లల మాదిరిగానే వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోందని చెప్పారు. దివ్యాంగుల తల్లిదండ్రులు తమ పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించి ఉన్నత విద్యకు తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎల్.అప్పలశివరామమ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు సతీష్‌కుమార్, శివ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కామాక్షి అమ్మవారి బ్రహ్మోత్సవాలు


పూజల్లో పాల్గొన్న మహిళలు, ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సాలూరు రూరల్: సాలూరులోని కామాక్షి అమ్మవారి ఆలయంలో అమ్మవారి బ్రహ్మోత్సవాలు రెండో గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం శాస్త్రోక్త పూజలు చేశారు. అమ్మవారికి 108 చీరలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం పెద్దసంఖ్యలో మహిళలతో ప్రత్యేక కుంకుమ పూజారాధన నిర్వహించారు. అలాగే బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆలయ వ్యవస్థాపక గురువు ముద్దు సత్యనారాయణ ఆధ్వర్యంలో సౌందర్య లహరి హోమ పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు రుద్ర నమక చమకాది కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి స్తోత్రాలు పఠించారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

రహదారి పనుల పరిశీలన

మక్కువ: మార్కొండపుట్టి పంచాయతీ బోరింగువలస నుంచి మట్టవలస గ్రామం వరకు ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న మట్టి రహదారి నిర్మాణ పనులను ఏపీవో ఎస్.ఈశ్వరమ్మ గురువారం పరిశీలించారు. పనివేళలు సక్రమంగా పాటించాలని వేతనదారులకు సూచించారు. డబ్బగెడ్డ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో మస్తర్లను పరిశీలించారు. ఎండల తీవ్రత దృష్ట్యా పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. మస్తర్లలో తేడా వస్తే సహించేది లేదని హెచ్చరించారు. పని అడిగిన ప్రతిఒక్కరికీ జాబ్‌కార్డు సత్వరమే అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

గర్భిణుల్లో రక్తహీనతపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో గీతాంజలి

సీతంపేట: గర్భిణుల రక్తహీనతపై వైద్యాధికారులు దృష్టి సారించాలని ఎంపీడీవో గీతాంజలి ఆదేశించారు. గురువారం స్థానిక మండల మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో మర్రిపాడు, సీతంపేట, కుశిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలతో రక్తహీనత తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అందుతున్న పోషణ పౌష్టికాహారంపై ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు, వీవోఏలు సమన్వయంతో పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కొండపల్లి సత్యం, సీడీపీవో రంగలక్ష్మి, ఏపీఎం విజయకుమారి పాల్గొన్నారు.

తాగునీరు వృథా

● మరమ్మతులకు గురైన పైపులైన్లు
● కొళాయిలకు కానరాని ట్యాప్‌లు ● చర్యలు తీసుకోని అధికారులు


గజపతినగరం బూర్లి వీధిలో వృథాగా పోతున్న తాగునీరు

గజపతినగరం: నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరం పట్టణంలో తాగునీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలు విమర్శలు వినవస్తున్నాయి. పట్టణంలోని బూర్లి వీధి, మేదర వీధిలో వీధి కొళాయిలు పాడవ్వడంతో ఉదయం, సాయంత్రం తాగునీరు వృథాగా పోతుంది. గత 15 ఏళ్ల కిందట వేసిన పైపులైన్లు పాడవ్వడంతో పాటు కొళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో నీరు వృథా అవుతుంది. వేసవిలో కొన్ని ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు పడుతుంటే గజపతినగరంలో మాత్రం నీరు వృథాగా పోవడంపై అధికారుల తీరుకు పట్టణవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గజపతినగరం పంచాయతీలో తాగునీటి పైపులైన్లకు సంబంధించి ఇదివరకే మరమ్మతులు చేపట్టాం. ఇంకా పైపులైన్లు లీక్‌లు ఉన్నచోట మరమ్మతులు చేపట్టేవిధంగా చర్యలు తీసుకుని పూర్తి స్థాయిలో పట్టణవాసులకు తాగునీరు సరఫరా చేస్తాం.

- రమణ, ఈవో, గజపతినగరం

అడుగడుగునా గోతులే..

● భోగాపురం మండలంలో అధ్వానంగా రహదారులు
● ప్రమాదాల బారిన పడుతున్న వాహనచోదకులు ● పట్టించుకోని అధికారులు


భోగాపురం మండలంలో గోతులమయంగా ఉన్న గ్రామీణ రహదారులు

భోగాపురం: భోగాపురం మండలంలో ఏ రహదారి చూసినా గోతులమయంగా దర్శనమిస్తోంది. గుంతలు, రాళ్లు తేలిన ఈ రహదారుల్లో ప్రయాణించే వాహనచోదకులు, బాటసారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మండ లంలోని రెడ్డికంచేరు నుంచి బమ్మిడిపేట మీదుగా ముంజేరు వైపు వెళ్లే బీటీ రహదారి, రెడ్డికంచేరు నుంచి తోటపల్లి మీదుగా ముక్కాం గ్రామం వైపు వెళ్లే బీటీ రహదారి, ముంజేరు సమీపంలో ఆర్అండ్ బీ రహదారి, భోగాపురం నుంచి చాకివలస వైపు వెళ్లే బీటీ రహదారి, ఇలా.. మండలంలో అన్ని రహదారులు అధ్వానంగా మారాయి. ఈ రహదారుల వెంట వెళ్లాలంటే నరకయాతనే. ప్రభుత్వ పాలకులు, అధికారులు రహదారులను పూర్తిగా పట్టించుకోకపోవడం వల్లే ఇలా తయారయ్యాయని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులు బాగు చేయాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవాలి

గుర్ల: బీసీజీ వ్యాక్సిన్‌ను 60 ఏళ్లు నిండినవారు తప్పనిసరిగా వేసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ జేడీ డా.నర్సింగరావు అన్నారు. మండలంలోని కోటగండ్రేడు, గుర్ల వెల్నెస్ కేంద్రాలను ఆయన గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లు నిండినవారు, ధూమపానం అలవాటు ఉన్నవారు, గతంలో టీబీ సోకినవారు, వారి కుటుంబ సభ్యులు బీసీజీ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎటువంటి అపోహలకు తావు లేకుండా వ్యాక్సిన్ వేసుకునేలా వివరించాలన్నారు. అలాగే బోదకాలు వ్యాధిపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట డీఐవో డా.అచ్యుతకుమారి, అడిషనల్ డీఎంహెచ్‌వో డా.రాణి తదితరులు ఉన్నారు.

27న భగవద్గీత పోటీలు

చీపురుపల్లి: స్థానిక గీతా మందిరంలో ఈనెల 27న సాయంత్రం 4 గంటలకు భగవద్గీత శ్లోక పఠన పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనదలచినవారు భగవద్గీతలో ఏవైనా మూడు శ్లోకాలు, వాటి అర్థాలు చెప్పాలన్నారు. అదేవిధంగా శ్రీమద్భగవద్గీత- మానవత అనే అంశంపై వక్తృత్వ పోటీలు కూడా ఉంటాయని చెప్పారు. పోటీల్లో గెలుపొందిన వారికి చీపురుపల్లి ఎస్‌బీఐ మేనేజరు గొడె వీఎస్ ప్రకాష్ చేతులమీదుగా బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు 9440105279 నెంబరులో నిర్వాహకుల్ని సంప్రదించాలని వారు కోరారు.

మలేరియా నియంత్రణకు చర్యలు


పి.కోనవలసలో దోమల మందు పిచికారీని పరిశీలిస్తున్న డీఎంవో జగన్మోహన్‌రావు

పాచిపెంట: మలేరియా నియంత్రణలో భాగంగా మొదటి విడత దోమల మందు పిచికారీ చేస్తున్నామని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహన్ రావు తెలిపారు. మండలం లోని పి.కోనవలస, పనసలపాడు గ్రామాల్లో చేపట్టిన స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. దోమల మందు పిచికారీ ఏ విధంగా చేస్తున్నారు.. నిబంధనలు ఏ మేరకు పాటిస్తున్నారో తనిఖీ చేశారు. ప్రతి ఇంటిలో తప్పనిసరిగా స్ప్రేయింగ్ చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. స్ప్రేయింగ్ పూర్తయిన ఇళ్లకు మార్కింగ్ తప్పనిసరి అని ఆదేశించారు. జిల్లాలో ఏడు సబ్ యూనిట్ల పరిధిలో 401 మలేరియా ప్రభావిత గ్రామాల్లో మొదటి విడత స్ప్రేయింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. వీటిలో సాలూరు సబ్ యూనిట్ పరిధిలో 126 గ్రామాల్లో పిచికారీ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆయన కళ్లు సజీవం


సత్యనారాయణ (ఫైల్)

నెల్లిమర్ల: జరజాపుపేటకు చెందిన కాళ్ల సత్యనారాయణ(74) అనారోగ్య కారణాల రీత్యా బుధవారం ఉదయం మృతిచెందారు. ఆయన కుమారుడు, న్యాయవాది కాళ్ల సన్యాసిరావు.. తల్లి ఆనందమ్మ, కుటుంబీకులతోనూ చర్చించి మరణించిన తన తండ్రి నేత్రాలను దానం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు విజయనగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులకు సమాచారం అందించారు. వారు బుధవారం సాయంత్రం అవసరమైన సామగ్రితో జరజాపుపేట చేరుకుని కళ్లలోని రెటీనాను తొలగించి భద్రపరిచారు. వారికి గ్రామ పెద్దలు అభినందించారు.

ఉపాధి పనుల వద్ద టెంట్లు ఏర్పాటు


ఎన్జీఆర్‌పురంలో ఉపాధి పనుల వద్ద టెంట్లను ఏర్పాటుచేసిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గజపతినగరం: ఉపాధి హామీ పనుల వద్ద 'కిట్లు కరువు, టెంట్లు లేవు' పేరిట గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద టెంట్లు ఏర్పాటు చేసే విధంగా ఉపాధి హామీ పథకం ఏపీవో రామారావు చర్యలు తీసుకున్నారు. అలాగే కిట్లుకు సంబంధించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు.

పూతికవలస లేఅవుట్‌లో హెచ్చరికబోర్డు ఏర్పాటు

కురుపాం: కురుపాం-2 సచివాలయం పరిధిలోగల పూతికవలస గ్రామానికి ఆనుకుని ఉన్న లేఅవుట్ స్థలంలో గురువారం సంబంధిత సచివాలయ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. ఇటీవల బుడా అధికారులు ఈ స్థలాన్ని పరిశీలించారు. వీరి పరిశీలనలో కొంతమంది రియల్ ఎస్టేట్‌దారులు ఇక్కడ ఎటువంటి అనుమతి లేకుండా క్రయవిక్రయాలు జరుపుతు న్నట్టు తెలుసుకున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి బి.అనితకు, సంబం ధిత సిబ్బందికి వివరణ కోరారు. ఈ మేరకు ఈ స్థలంలో అనుమతి లేకుండా క్రయ విక్రయాలు నిషేధం, చట్ట వ్యతిరేకం అని పంచాయతీ అధికారులు గురువా రం హెచ్చరిక బోర్డు పెట్టారు. పంచాయతీరాజ్ చట్టం 1994 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.అని త, వీఆర్వో స్వరాజ్యం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కె.రశ్మిత, తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడవద్దు

బలిజిపేట: మండలంలోని బర్లి, పనుకువలస, చిలకలపల్లి గ్రామాల్లో సీఐ కె.రవికుమార్ గురువారం పర్యటించి, ప్రజలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు అనంతరం ఏ పార్టీ గెలిచినా గ్రామాల్లో ర్యాలీలు, ఊరేగింపులు చేయరాదన్నారు. ఎటువంటి అల్లర్లకు పాల్పడినా చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ ఎం.పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు సంయమనం పాటించాలి

సీతానగరం: ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న జరుగనున్నందున అంతవరకు మండల ప్రజలు సంయమనం పాటించాలని ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. మండ లంలోని తామరఖండి బగ్గందరవలస, బల్లకృష్ణపురం గ్రామాల్లో ఆయన గురువా రం పర్యటించి, స్థానిక నాయకులు, ప్రజలతో మాట్లాడారు. గామాల్లో శాంతిభద్ర తలకు విఘాతం కలిగిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వంశధార నదీతీరంలో అధికారుల పరిశీలన


పసుకుడిలో నదీతీరాన్ని పరిశీలిస్తున్న జేసీ శోభిక, తదితరులు

భామిని: మండలంలోని వంశధార నదీ తీరంలో మంజూరైన ఇసుక ర్యాంప్‌లను గురువారం అధికారులు సందర్శించారు. పార్వతీపురం జేసీ శోభికతో పాటు మైన్స్, పోలీస్, పంచాయతీ రాజ్ అన్ని శాఖల అధికారులు మ్యాప్‌ల ద్వారా ఆరా తీశారు. లివిరి, పసుకుడి, నేరడి, బిల్లుమడ ర్యాంప్‌ల స్థితిగతులను చూశారు. అయితే నేరడి, బిల్లుమడలో గతంలో ర్యాంపులు మంజూరై ఇసుక తరలించగా, లివిరి, పసుకుడిలో మంజూరైనా ఇసుక క్యారీ ఏర్పాటు కాలేదని అధికారులు తెలిపారు. మైన్స్ ఏడీ శ్రీనివాసరావు, డీపీటీవో సత్యనారాయణ, స్థానిక సర్వేయర్ రాజేష్, ఆర్ఐ రాంబాబు, ఎస్ఐ సీహెచ్ ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జేసీ పర్యటనతో నిలిచిపోయిన లారీలు

మండలంలోని ఇసుక రీచ్‌ల్లో జేసీ పర్యటనతో బాలేరు, దిమ్మిడిజోల మధ్య వరదగట్టు కాలువపైన వందలాది లారీలు నిలిచిపోయాయి. ఒడిశా అనుమతులతో ఆంధ్రా వైపు ఒడిశా భూభాగంలోనే తరలిస్తున్న ఇసుక గురువారం తాత్కాలికంగా నిలిపివేయడంతో రోడ్డుపైన పార్కింగ్ చేస్తే అధికారుల దృష్టి పడుతుందని వరద కాలువ గట్టుపైనే లారీలను నిలిపివేశారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ రాజాం బ్రాంచ్ వారి ... పబ్లిక్ నోటీసు. శ్రీకాకుళం జిల్లా, రాజాం మండలం, ... గ్రామం, ... కాపురస్థులైన శ్రీ/శ్రీమతి ... సత్యనారాయణ S/o సూర్యనారాయణ నా క్లయింటు సంస్థ ... షెడ్యూలులో ... షెడ్యూలు: శ్రీకాకుళం డివిజన్, రాజాం సబ్ డి, రాజాం మండలం, గురువాం గ్రామపంచాయతీ పరిధిలో గల సర్వే నెం.176-11కు ... 10.5అ, ఉత్తరంకు 65.5అ మొత్తం 54.25చగలు ... 12అ వెడల్పు గల సిమెంటు రోడ్డు ... సర్వే నెం.176-11కు ... 14.5అ, ... 71.6అ మొత్తం 116.19చగలు ... 12అ వెడల్పు గల సిమెంటు రోడ్డు.

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింటు M/s SHRIRAM FINANCE LIMITED విజయనగరం బ్రాంచి విజయనగరం-I వారు ఇచ్చిన ... ప్రకారము యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని రిజిస్టరు తనఖా చేయించుకొని శ్రీమతి మల్ల సుగుణవతి W/o మల్ల రాజబాబు ఈమె యొక్క ప్రాపర్టీని షూరిటీగా తీసుకొని వీరి కుమారుడైన మల్ల జగదీష్ S/o మల్ల రాజబాబు ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహార మునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైనను ఎటువంటి జప్తులు, చార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంటు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న ఎడల నేటి నుండి ఏడు దినములలో ఈ క్రింది చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియచేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులుకారు.

షెడ్యూలు ఎ: విజయనగరం జిల్లా, విజయనగరం సబ్‌రి॥ యిలాకా, విజయనగరం మున్సిపాలిటీ, విజయనగరం టౌన్, సంతపేట వార్డువార్డు, ఎం.సి.వార్డు నెం.13కు, గుంటూరు వారి వీధిలో రోడ్డునకు దక్షిణ శ్రేణిని యున్నటువంటిన్నీ, మున్సిపల్ టి.యస్.నెం. 969 భాగం, 974కు భాగం, బ్లాకు నెం.22కు, ఎసెస్మెంటు నెం. 1093016115కు, డోర్‌నెం. 13-4-25కులో భాగమైనటువంటిన్నీ, సిరాస్తి ఖాళీ నివేశన స్థలములకు కొలతలు, హద్దులు వివరం: 1వ ప్రతి కొలతలు: తూ॥ప॥లకు 16అ॥ (4.82మీ॥), ఉ॥ద॥లకు 96అ॥ (28.25మీ॥) పూర్తి పర్మితి 171 1/3చ॥గ॥ లేక 143.262చ॥మీ॥లు. 2వ ప్రతి కొలతలు: తూ॥ప॥లకు దక్షిణ దిశ 21అ॥9అం (6.60మీ॥), తూ॥ప॥లకు ఉత్తర దిశ 15అ॥9అం (4.71మీ॥), ఉ॥ద॥లకు తూర్పు దిశ 96అ॥ (28.25మీ॥), ఉ॥ద॥లకు పశ్చిమ దిశ 90అ॥ (27.44మీ॥) పూర్తి పర్మితి 194చ॥గ॥ లేక 167.207చ॥మీ॥లు, వెరశి పూర్తి పర్మితి 365 1/3 చ॥గ॥(310.469చ॥మీ॥) విస్తీర్ణం కలిగి ఒక దానికొకటి అత్తి అనుకొని యుండి ఏకప్రతిగా యున్నందున మొత్తంనకు హద్దులు: తూ: శ్రీపాద జగన్నాథం గారి యిల్లు ప్రహారీగోడ, ద: మున్సిపల్ పబ్లిక్ రస్తా, ప: గుడిమెళ్ల గోపాలాచారి గారి శ్లాబ్ దాబాయిల్లు నివేశనములున్నూ మూడుగుల సుబ్బారావు వారి ఖాళీ స్థలంన్నూ, ఉ: గుంటూరు వారి వీధి మున్సిపల్ రోడ్డు. పై హద్దులు మధ్యస్థమైన స్థిరాస్తి ఖాళీస్థలం 365 1/3చ॥గ॥ (310.469చ॥మీ॥)లలో అశుభక్తపు రియు అనిర్దిష్టపు ఖాళీ స్థలం 30చ॥గ॥(25.20చ॥మీ॥)విస్తీర్ణం

షెడ్యూలు "బి": పైనుదహరించిన ఎ షెడ్యూలు మొత్తం స్థలంలో నిర్మించినటువంటి "ABHILASH CLAVE" లో ఆర్.సి.సి బిల్డింగ్‌లో సెకండ్ ఫ్లోర్‌లో గల ఫ్లాట్ నెం. ఎస్-3 1000చ॥అ॥ (కామన్ యూత్ కలిపి) పర్మితితో గల ఆర్.సి.సి. రెసిడెన్షియల్ పోర్షన్‌కు హద్దులు వివరం హద్దులు: తూ: కామన్ కారిడార్, ద: ఒపెన్ టూ స్కై, ప: ఒపెన్ టూ స్కై, ఉ: ఫ్లాట్‌నెం. ఎస్-2

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759









